క్లుప్తంగా

ప్రహరీ లేని ఎస్సీ హాస్టల్



మల్దకల్: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు ప్రహరీ కూలిపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. అయిజ– గద్వాల ప్రధాన రహదారిలో హాస్టల్ ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా సమస్యను మాత్రం పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వీధికుక్క దాడిలో లేగదూడ మృతి

అయిజ: మండల కేంద్రంలో శనివారం రాత్రి కొత్త బస్టాండ్ సమీపంలోని రైస్‌మిల్లు పక్కన అనారోగ్యంతో ఉన్న ఆవు లేగదూడకు జన్మనిచ్చింది. క్రమంలో వీధికుక్క లేగదూడపై దాడి చేసి చంపి తినేసింది. ఆదివారం గమనించి స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.వీధుల్లో ఉంటున్న ఆవులను కాపాడాలని కోరుతున్నారు.

పట్టణంలో లోపించిన పారిశుద్ధ్యం



అయిజ: మున్సిపాలిటీ నడిబొడ్డున పశువుల దవాఖానా వద్ద పెద్దవాగుపై నిర్మించిన కల్వర్టుకు ఇరువైపులా ఉన్న చెత్తా చెదారంతో నానా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలవుతున్నట్లు పేర్కొన్నారు. నిత్యం అధికారులు అదే మార్గం గుండా ప్రవహిస్తున్న పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్త సమస్య తీర్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసుల నమోదు

గద్వాల క్రైం: పట్టణ శివారులో ఆదివారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 10 మంది వాహనదారులు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడినట్లు ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ బాలచంద్రుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్ అవార్డు గ్రహీతకు సన్మానం

వనపర్తి టౌన్: జిల్లా వాసి మద్దాలి వెంకటేశ్వరరావు నిర్మించిన చదువుకోవాలి అనే సినిమాకు రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ అవార్డును ప్రదానం చేసింది. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా గద్దర్ అవార్డు గ్రహీత మద్దాలి వెంకటేశ్వరరావును ప్రజాశిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామానికి చెందిన మద్దాలి వెంకటేశ్వరరావు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వ్యాప్తి కోసం సినిమా నిర్మించి, ప్రతిష్టాత్మకమైన గద్దర్ అవార్డును శనివారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. జిల్లా వాసికి తొలిసారి ఈ అవార్డు రావడం ఆనందకరమన్నారు. సినీ రంగంలో వనపర్తి పేరు గద్దర్ అవార్డుతో మరింత పెరిగిందన్నారు. అదేవిధంగా పాత్రికేయుల సంఘం జిల్లా అధ్యక్షుడు బక్షి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో, అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో సైతం గద్దర్ అవార్డు గ్రహీత మద్దాలి వెంకటేశ్వరరావును శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నందిమల్ల యాదయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు డబ్బులు చెల్లించకపోవడం దుర్మార్గం

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధిహామీ కూలీలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటలాడుతూ కష్టపడి పనిచేసిన కూలీలకు కూలి డబ్బులు వేయకపోవడం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రిప్రసాద్ మండిపడ్డారు. ఆదివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీలకు రెండునెలల పెండింగ్ డబ్బులు ఇవ్వాల్సి ఉండగా, అరకొర కూలి డబ్బులు మాత్రమే వేసి చేతులు దులుపుకొనే ప్రక్రియ చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఉపాధి సిబ్బందికి సైతం రెండు నెలల నుంచి వేతనాలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కూలీల పెండింగ్ డబ్బులు, సిబ్బంది వేతనాలు విడుదల చేసి వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

కెనాల్ దాటేది ఎలా సారూ?

- ఇనుప వంతెనలపై తరచూ ప్రమాదాలు
- హామీలు నీటి మూటలేనంటున్న ప్రజలు
- నిధులు మంజూరు కాలేదంటున్న అధికారులు



తనగల తుమ్మిళ్ల లిఫ్ట్ డెలివరీ పాయింట్ వద్ద ప్రమాదభరితంగా ఇనుప వంతెన

శాంతినగర్: ఆర్డీఎస్ పరివాహక ప్రాంతాల్లోని రైతులు, కూలీలు కెనాల్ దాటి పొలాలకు వెళ్లాలంటే భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. కెనాల్ దాటేందుకు ఏర్పాటు చేసిన ఇనుప వంతెనలపై ఎప్పుడు ఏ ప్రమాదంలో జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు మండల వాసులు.

శిథిలావస్థకు చేరిన వంతెనలు

నిజాం కాలంలో తవ్విన ఆర్డీఎస్ కెనాల్‌పై రాకపోకలు జరపడానికి కెనాల్‌పై ఏడు చోట్ల, వడ్డేపల్లి మండలంలో మూడు చోట్ల ఇనుప స్తంభాలు, రేకులతో తాత్కాలిక వంతెనలు ఏర్పాటు చేశారు. ఇనుప వంతెనల నిర్మాణం చేపట్టి సుమారు 70 ఏళ్లు కావడంతో ఇనుము తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. రేకులు పెద్ద రంధ్రాలు పడి కాలినడకన వెళ్లడానికి ఇబ్బందికరంగా మారాయి. ఆవలివైపు పొలాలకు వెళ్లాలంటే కిలోమీటర్ల మేర ముందుకు వెళ్లి రావడానికి ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా హామీలు ఇస్తున్నారే తప్పా వంతెనల నిర్మాణం చేపట్టడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇరుకు వంతెనలపై వెళ్తూ

మూడడుగుల మేర ఏర్పాటు చేసిన తాత్కాలిక ఇనుప వంతెనలపై వెళ్తు ఆర్డీఎస్ కాల్వలో పడి ప్రమాదాల పాలవుతున్నారు. నీళ్లున్న సమయంలో వాహనాలు రైతులు, కూలీలు కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. నీళ్ల లేని సమయంలో రైతులు కెనాల్‌లో పడి కాళ్లు చేతులు విరిగి ఆస్పత్రి పాలవుతున్నారు.

ఐదు కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే

ఇనుప వంతెనలపై కాకుండా ఆర్డీఎస్ కెనాల్‌పై సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో చిన్న కల్వర్టు ప్రధాన కూడళ్ల వద్ద నిర్మించారు. కల్వర్టులు పొలాలకు వెళ్లేందుకు దూరంగా ఉండటంతో సమీపంలోని ఛానల్‌పై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కెనాల్‌లో పొలాలు కోల్పోవడమే గాక మా పొలాలకు మేము వెళ్లలేని దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంతెన నిర్మించాలి



జూలెకల్ సమీపంలోని ఆర్డీఎస్ ప్రధాన కాల్వ ఎగువన ఉన్న పొలానికి గ్రామానికి కిలోమీటర్ దూరంలో నేరుగా బాట వుండేది. కెనాల్ తవ్వడంతో బాట లేకుండా పోయింది. రైతులు, కూలీలు దాటడానికి ఇనుప వంతెనలు ఏర్పాటు చేశారు. పదేళ్ల క్రితం రేకు తుప్పుపట్టి నామరూపాల్లేకుండా పోయింది. ఇనుప వంతెనల స్థానంలో శాశ్వత వంతెన ఏర్పాటు చేయాలి.

– రాజేంద్రప్రసాద్, రైతు, జూలెకల్

చుట్టూ తిరిగి వెళ్లాలి



తుమ్మిళ్ల లిఫ్ట్ డెలివరీ పాయింట్ వద్ద గతంలో ఇనుప స్తంభాలు, రేకులతో తాత్కాలిక బాట ఏర్పాటు చేశారు. వర్షం నీరు రేకులపై నిలిచి తుప్పుపట్టి రేకులు పడిపోయాయి. కెనాల్‌కు ఆవలి వైపున ఉన్న పొలాలకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కనీసం మరమ్మత్తులైనా చేయించి వంతెనకు ఇరువైపుల రక్షణ కంచె ఏర్పాటు చేయాలి.

– శ్రీను, రైతు, తనగల

నిధులు మంజూరు కాలేదు



వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల, జూలెకల్, అయిజ మండల పరిధిలోని ఉప్పల క్యాంప్‌ల వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక ఇనుప వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతు కోసం నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభించి రైతుల సమస్య పరిష్కరిస్తాం.

– శ్రీనివాసులు, ఏఈ, నీటిపారుదలశాఖ

ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న కుర్వ పల్లయ్య

గద్వాల: జిల్లాలో ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని బీఆర్ఎస్ నాయకుడు కుర్వ పల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలో 25 శాతం పేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలన్నారు. కానీ ఏఒక్క పాఠశాల యాజమాన్యం కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. అదే విధంగా అయిజలో బీజీఆర్ పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ పేరుతో విపరీతంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాకతీయ పాఠశాలకు హైస్కూల్‌కు అనుమతులు లేనప్పటికీ 8, 9, 10వ తరగతులు బోధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో సైతం సీబీఎస్ఈకి అనుమతులు లేవని అయినప్పటికీ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహేష్, మాధవ్,రంగస్వామి పాల్గొన్నారు.

వీహెచ్‌పీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

గద్వాలటౌన్: విశ్వ హిందూ పరిషత్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన సమావేశానికి వీహెచ్‌పీ ప్రాంత ఉపాధ్యక్షుడు జగదీశ్వరయ్య ముఖ్య అతిథిగా హాజరవగా, ఆయన ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా అల్లూరి ఫణిమోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా ఆనంద్, ఉపాధ్యక్షులుగా బ్రహ్మేశ్వర్‌రెడ్డి, మాణిక్య వెంకటేశ్వర్, మరిడి శ్రీకాంత్, జయశ్రీ, సహ కార్యదర్శులుగా శ్రీకాంత్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, వెంకటేష్, మల్లేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు. అదే విధంగా వివిధ ఆలయాలకు సంయోజకులుగా మల్లికార్జున సాత్రే, తిరుపతి, మణి, విజయ్‌కుమార్, వెంకటేష్, శేషగిరిరావు, రంగనాయకులు, రవీంద్ర సింహాచార్య, భానుప్రకాష్, విశేష సంపర్క్ ప్రముఖ్‌గా అల్లూరి రాము, విశ్వసంపర్క్ ప్రముఖ్‌గా ఈశ్వరయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

సగరుల అభ్యున్నతికి కృషి

మదనాపురం: సగరుల అభ్యున్నతికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘం మండల అధ్యక్షుడు వేముల వెంకటన్న అన్నారు. సంఘం సీనియర్ నాయకుల సమక్షంలో ఆదివారం మండల కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా వేముల వెంకటన్న, ఉపాధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా కిరణ్, కార్యదర్శులుగా వేముల సత్యం, రావుల కొండన్న, ప్రచార కార్యదర్శులుగా శ్రీనివాసులు, వేముల నరేష్, కార్యవర్గ సభ్యులు రాములు, కృష్ణసాగర్, ప్రభాకర్‌తో పాటు మరికొందరిని నియమించారు. కార్యక్రమంలో చీకటి సత్యం, చీర పెద్దనాగులు, పోతుకపల్లి ఆంజనేయులు, చెన్నరాయుడు, సుగురు మురళి, పోత్కపల్లి కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ రైడింగ్ ప్రమాదకరం

- కిందపడితే ప్రాణాలకే ముప్పు
- పోలీసులకు దొరికితే భారీగా జరిమానా
- చిన్నపిల్లలకు బైక్‌లు ఇవ్వొద్దంటున్న పోలీసులు



బైక్ నడుపుతున్న మైనర్ బాలుడు



కొత్తకోటలో బైక్‌పై వెళ్తున్న యువకులు

కొత్తకోట రూరల్: పట్టణంలో స్పీడ్ బైక్‌లు పరుగులు పెడుతున్నాయి. యువత చేతిలో డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా వాహనాల మీద రయ్.. రయ్ మంటూ తిరుగుతున్నారు. అంతేకాకుండా మైనర్లు, యువత ముగ్గురికి మించి బైక్‌లపై ప్రయాణిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణిస్తే అదుపుతప్పి కిందపడితే ప్రాణాలకే ప్రమాదం అని పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నా కొందరిలో మార్పు రావడం లేదు.

వేల సంఖ్యలో కేసులు..

జిల్లావ్యాప్తంగా గడిచిన ఐదు నెలల్లో ట్రిపుల్ రైడింగ్ 4,748, డ్రంకెన్ డ్రైవ్ 1,248, మైనర్ డ్రైవింగ్ 10 ఇలా వేల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికితే రూ.వెయ్యి నుంచి రూ.5వేలు వరకు లేదా ఒక రోజు నుంచి 30రోజుల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉంది. మైనర్లు డ్రైవింగ్‌లో పట్టుబడితే రూ.5వేల నుంచి రూ.10వేల వరకు జరిమానాతో పాటు బైక్ నడిపిన వ్యక్తితో పాటు బైక్ ఇచ్చిన వ్యక్తికి శిక్ష ఉంటుంది. డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే రూ.5వేలు లేదా మూడు నెలల జైలు శిక్ష, ట్రిపుల్ రైడింగ్ దొరికితే రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు జరిమానా విధిస్తారు.

బాధ్యతగా వ్యవహరించాలి



బైక్‌పై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించే విషయంలో యువత బాధ్యతగా వ్యవహరించాలి. ముఖ్యంగా ప్రమాదాలు ట్రిపుల్ రైడింగ్, మద్యం తాగి వాహనాలు నడపడంతోనే జరుగుతున్నాయి. అలాగే డ్రైవింగ్‌లో ఫోన్ మాట్లాడే వారిపైన, బైక్ రేసింగ్ చేసే వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి. లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇచ్చే వారిపై చర్యలు తీసుకుంటే ట్రిపుల్ రైడింగ్, మైనర్లు బైక్ నడపడం వంటివి నివారించవచ్చు.

– భీమన్ననాయుడు, కానాయపల్లి

తనిఖీలు ముమ్మరం చేయాలి



మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, డ్రంకెన్ డ్రైవ్ వంటి వాటిని నివారించేందుకు పోలీసులు ప్రతిరోజు తనిఖీలు నిర్వహించాలి. చిన్న పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడంతో వారు ఇష్టం వచ్చినట్టు డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మైనర్లకు బైక్‌లు ఇస్తే పోలీసులు వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచి అవగాహన కల్పిస్తే బాగుంటుంది. మైనర్ డ్రైవింగ్‌పై పోలీసులు కఠిన ఆంక్షలు తీసుకోవాలి

– లాల్‌కోట రవి, కొత్తకోట

పట్టుబడితే కేసులు



ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్‌లో ఎవరూ పట్టుబడిన వారిపై కేసులు పెట్టి భారీగా జరిమానాలు విధిస్తున్నాం. ఇలాంటి వారిని స్టేషన్‌కు పిలిపించి తల్లిదండ్రులు సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నాం. ఇలా చేయడం వల్ల పిల్లల్లో మార్పు వస్తుంది. ట్రిపుల్ రైడింగ్ జోలికి వెళ్లరు. రెండు సార్లు ట్రిబుల్ రైడింగ్‌లో దొరికితే వాహన లైసెన్సు రద్దుకు సిఫారస్ చేయడంతో పాటు జరిమానాలు విధించి, కఠిన చర్యలు తీసుకుంటాం.

– రాంబాబు, సీఐ, కొత్తకోట

‘అభివృద్ధిలో దేశం దూసుకుపోతోంది’



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

గట్టు: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధిలో శరవేగంగా దూసుకుపోతుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ సంకల్ప కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ హయాంలో 11 ఏళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా కార్యదర్శ సురేష్, మండల అధ్యక్షుడు సంజీవనాయుడు, కార్యదర్శి వెంకటేష్, బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, బీజేపీ నాయకులు గోవిందు, సోమన్న, నర్సింహులు, లక్ష్మణ్‌గౌడు, బోయ వెంకటేష్, శ్రీరాములుగౌడు, విశ్వనాథ్, శ్రీను, తిమ్మప్ప, రాముడు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడలేని కల్వర్టులు



తాటికుంట స్టేజీ వద్ద రక్షణ గోడలు లేని కల్వర్టు



అయిజలో మోకాటి లోతు గుంతలుపడిన రోడ్డు

మల్దకల్ : మండలంలోని తాటికుంట, నాగర్‌దొడ్డి గ్రామ స్టేజీ సమీపంలోని గద్వాల– అయిజ ప్రధాన రహదారిపై కల్వర్టులకు రక్షణ గోడలు లేక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారలు వాపోతున్నారు. కల్వర్టుల నిర్మాణ సమయంలో రక్షణ గోడలు ఏర్పాటు చేయకుండా తాత్కాలికంగా ఇనుపకడ్డీలతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కల్వర్టుల వద్ద 10 అడుగుల లోతు గుంతలు ప్రమాదకరంగా ఉన్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టులకు రక్షణ గోడ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో బీటీరోడ్డు

అయిజ: శిథిలావస్థకు చేరిన అయిజ– గట్టు బీటీరోడ్డుపై ప్రయాణించాలంటేనే భయపడాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రోడ్డు శిథిలమై మోకాటి లోతు గుంతలుపడి నీరు నిల్వ ఉంటున్నట్లు పేర్కొన్నారు. గుంతల గుండా ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి తరచూ ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. శిథిలమైన రోడ్డుకు గత సంవత్సరం మరమ్మతు చేయించారు. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేయడంతో రోడ్డు వానలకు కొట్టుకపోయిందని పేర్కొన్నారు. ఇప్పటికైనీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని అయిజ, గట్టు మండలాల ప్రజలు కోరుతున్నారు.

బీఎస్పీతోనే మహనీయుల ఆశయాలు సాధ్యం



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

ఎర్రవల్లి: బీఎస్పీతోనే మహనీయుల ఆశయా లు సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ధర్మవరంలో బీఎస్పీ మండలాధ్యక్షుడు రాముడు ఆధ్వర్యంలో బూత్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. మహనీయుల ఆశయాలు రాజ్యాంగ పితామహుడు అంబేడ్కర్ ఇచ్చిన ఓటుహక్కు వల్లే సాధించవచ్చన్నారు. గ్రామాల్లో ప్రజలకు పూలే దంపతులు, మాన్యశ్రీ కాన్షీరాం చరిత్రను బోధించాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం బీఎస్పీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు. మహనీయుల చరిత్ర, సిద్ధాంతాలను ప్రజలకు చేరవేసి చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నితిన్, కుమార్, రాముడు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మురుగుతో నానా అవస్థలు



అమరవాయిలో రోడ్డుపై నిలిచిన మురుగు

మల్దకల్: మండలంలోని అమరవాయి గ్రామంలో ఇళ్ల మధ్యనే ఉన్న మురుగుతో నానా అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. రహదారిలో మురుగు నిల్వడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. మురుగుతో దోమలు విజృంభిస్తుండటంతో రోగాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. ప్రత్యేక అధికారి గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలని ధర్నా



చెన్నిపాడులో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

మానవపాడు: ప్రభుత్వాలు మారుతున్నా రోడ్డు పరిస్థితి మారడం లేదు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల హామీలు నీటిపై బుడగల మాటలకే పరిమితమవుతున్నాయని ఆగ్రహించిన ప్రజలు నడిరోడ్డుపై ఆదివారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు చెన్నిపాడు గ్రామస్తులు. మానవపాడు మండలంలోని చెన్నిపాడు నుంచి మానవపాడు మండ కేంద్రానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా నిత్యం ప్రమాదాలకు గురవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. మోకాటి లోతు గుంతల్లో ప్రమాదాల బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నోమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరారు.

‘రైతునేస్తం’ జయప్రదం చేయాలి

ఇటిక్యాల/ఎర్రవల్లి/గట్టు: మండలంలోని ఇటిక్యాల, చాగాపురం రైతు వేదికల్లో సోమవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రైతు వేదికలకు ప్రభుత్వం నుంచి కొత్తగా వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు రైతులతో ముఖ్యమంత్రితో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందన్నారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

❖ రైతునేస్తం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రైతులు పెద్దఎత్తున హాజరు కావాలని తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్ కోరారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు గట్టు మండల పరిధిలోని బోయలగూడెం రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి రైతునేస్తం ప్రారంభోత్సవ కార్యక్రమం వీక్షించవచ్చని పేర్కొన్నారు.

❖ ఎర్రవల్లి మండల పరిధిలోని వేముల, ధర్మవరం రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి

అమరచింత: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని మాస్‌లైన్ మండల పార్టీ కార్యదర్శి రాజన్న, పట్టణ కార్యదర్శి మస్లమణి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గద్దెనెక్కి 18 నెలలు దాటినా ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. జూన్ 2 నుంచి ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాశం రుణాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు కనీసం ఒక్కరికి కూడా ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల పేర్లను కూడా బయటపెట్టడం లేదన్నారు. మహిళలకు ప్రతి నెల రూ.2,500, ఆడపిల్లలకు స్కూటీలు, పెన్షన్‌ల అమలు చేయకుండా కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తామన్న హామీని సైతం ఇప్పటి వరకు పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ డివిజన్ నాయకులు రాజు, ఆనంద్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.